## పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి

చిట్యాల, ఫిబ్రవరి 15 : పదోతరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలి డీఈఓ బొల్లారం భిక్షపతి సూచించారు. మండలంలోని వెలిమినేడు, గుండ్రాంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల ప్రతిభ పాటవాలను పరిశీలించి మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా పదో తరగతి పరీక్షల కోసం సిద్ధమవ్వాలని, ఉపాధ్యాయులు కూడ విద్యార్థులను అందుకు అనుగుణంగా సిద్ధం చేయాలని సూచించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు నర్సింహారెడ్డి, లింగయ్య, అంజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి : డీఎంహెచ్ కొండల్‌రావు


రికార్డులను పరిశీలిస్తున్న కొండల్‌రావు

శాలిగౌరారం, ఫిబ్రవరి 15 : వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్ఓ కొండల్‌రావు ఆదేశించారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. జిల్లావ్యాప్తంగా సిబ్బంది కొరత ఉన్న నేపథ్యంలో పీహెచ్‌సీలకు సరైన సిబ్బందిని కేటాయించలేకపోతున్నట్లు ఆయన చెప్పారు. మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియోను విజయవంతం చేసే దిశగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యాధికారి శిల్ప, సిబ్బంది ఉన్నారు.

## 18న ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

నకిరేకల్, ఫిబ్రవరి 15 : ఈ నెల 18న నెల్లిబండ గ్రామంలో శీతలా పరమేశ్వరీ సహిత ముత్యాలమ్మ, కోటమైసమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు గ్రామ కార్యనిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 16న విగ్రహాలకు జలాధివాసం, మహానివేదన, నీరాజన మంత్రపుష్ప సమర్పణ, 17న చండీహవనం, విగ్రహాలకు పంచామృతాభిషేకం, 18న అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని తెలిపారు.

## 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న వాహనంతో పోలీసులు

దామరచర్ల, ఫిబ్రవరి 15: మిర్యాలగూడ నుంచి ఆంధ్రాలోని గుంటూరుకు అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొన్నట్లు వాడపల్లి ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మండలంలోని వాడపల్లి చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీ నిర్వహిస్తుండగా టాటా యోధా వాహనం ఆపకుండా పోతున్న క్రమంలో వెంబడించి చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు చెప్పారు. డ్రైవర్ వాహనాన్ని వదిలి పారిపోయాడని వాహనం తనిఖీ చేయగా అందులో 20 క్వింటాళ్ల బియ్యం ఉండటంతో వాహనాన్ని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

## విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టడానికే టాలెంట్ టెస్ట్ : ఎస్ఎఫ్ఐ

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 15: పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల్లో భయాన్ని పోగొట్టేందుకే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు నల్లబెల్లి జగదీశ్ తెలిపారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం టాలెంట్ టెస్ట్ కరపత్రాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఈనెల 18న నిర్వహించే జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ చాటాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోతీలాల్, మధు, సునీత, నాయకులు పాల్గొన్నారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్
జోనల్ Sastra : 6-3-865, మై హోమ్ జూపల్లి, గ్రీన్ ల్యాండ్, అమీర్‌పేట్, హైదరాబాద్-500016
ఫోన్ నం: 040-29998839, ఇ-మెయిల్: zs8347@pnb.co.in

సవరణ

NPA A/C M/s తుస్కర్ ఫార్మా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో తనఖా పెట్టిన ఆస్తుల అమ్మకానికి సంబంధించి 31.01.2024న ఈ వార్తా పత్రికలో ప్రచురితమైన వేలం ప్రకటన పరిపాలనా కారణాల వల్ల రద్దుచేయబడినది/ ఉపసంహరించుకోబడినది.

సం/- అధీకృత అధికారి, పంజాబ్ నేషనల్ బ్యాంక్
తేది: 16.02.2024, ప్రదేశం: హైదరాబాద్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, ABDUL RASHEED (Old Name), R/o. 4-10-350, Abbasiya Cly., Devarkonda Road, Nalgonda Town Dist., TS. Changed My Name as MOHAMMAD ABDUL RASHEED (New Name), S/o. Abdul Hameed. NT-311758

★ I, RAHMATH ALI SYED (Old Name), R/o. 5-10-85/G, Manyamchalka, Nalgonda Town Dist., TS. Changed My Name as RAHMATH ALI SAYED (New Name), S/o. Abbas Ali Syed. NT-311758

★ I, KHAMARUNNISA MOHAMMED (Old Name), R/o. 5-9-113, Manyamchalka, Nalgonda Town Dist., TS. Changed My Name as KHAMAR UNISSA (New Name), W/o. Mohammed Ahmed. NT-311758

★ I, KHAJA QUTUBUDDIN AHMED (Old Name), R/o. 6-2-872, Meer Bagh Cly., Nalgonda Town Dist., TS. Changed My Name as KHAJA QUTUBUDDIN AHMAD (New Name), S/o. Gulam Ali. NT-311758

★ I, SAYYEDA ZUBEDA AKHTAR (Old Name), R/o. 6-2-872, Meer Bagh Cly., Nalgonda Town Dist., TS. Changed My Name as SYYEDA ZUBEDA AKTHAR (New Name), W/o. Khaja Qutubuddin Ahmad. NT-311758

WANTED

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899. NT-319437-All

ప్లాట్ అమ్మబడును

నల్లగొండ పట్టణంలో సాగర్ హైవేకి అతి దగ్గరగా జూలకంటి ఇంద్రారెడ్డి ఫంక్షన్ హాల్ ప్రక్కన వున్న పడమర ఫేస్ 215 చ॥గజముల ప్లాట్ అమ్మబడును. సంప్ర॥9963729593. NLG-310794

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635 |
| హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638 |
| మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638 |


# సేవాలాల్ మార్గంలో గిరిజనులందరూ నడువాలి

- మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు


మిర్యాలగూడ : మహాభోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 15 : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ మార్గంలో ప్రతి ఒక్క గిరిజనుడు నడువాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. గురువారం సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గిరిజన ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మహాభోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు మాట్లాడుతూ సంత్ సేవాలాల్ ఆశయాలను గిరిజనులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సేవాలాల్ మహారాజ్‌ను బంజారాలు కుల దైవంగా భావించి ఆరాధిస్తారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజనులు అన్ని రకాలుగా ఆదుకుందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ సేవాలాల్ జయంతిని అధికారికంగా ప్రకటించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, దామరచర్ల జడ్పీటీసీ ఆంగోతు లలితాహాతీరాంనాయక్, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టి బాబునాయక్, ఎంపీటీసీలు వీరనాయక్, కుర్ర కాంతి, ఎంఈఓ బాలాజీనాయక్, గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్ర కృష్ణకాంత్, నాయకులు బానావత్ సైదులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ : గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీసంత్‌సేవాలాల్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మిర్యాలగూడ కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ, ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షమయ్యగౌడ్ మాట్లాడుతూ ధైర్య సాహసాలకు ప్రతీకగా నిలిచిన సేవాలాల్ మహారాజ్ బంజారాలకు ఆరాధ్యుడని అన్నారు. కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ రాంరెడ్డి, అధ్యాపకులు హాము, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు ఎన్. కోటయ్య, జె.నరేందర్‌రెడ్డి, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

త్రిపురారం : సంత్ సేవాలాల్ 285వ జయంతి వేడుకలను డాక్టర్ ఆనంద్ ఆధ్వర్యంలో రూప్లాతండా, ఇస్లావత్‌తండా, డొంకతండా, శ్రీగణపతి అభయాంజనేయ స్వామి ఆలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చినగోపాల్, సుజాత, గోవింద్ పాల్గొన్నారు.

### ఎంజీయూలో..

నల్లగొండ రూరల్ : ఎంజీయూ ఎస్సీ,ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో గురువారం ఎంజీయూలో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ఎంజీయూ ఉపకులపతి ఆచార్య గోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం క్రీడ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆల్వాల రవి, ఎస్సీ,ఎస్టీ సెల్ డైరెక్టర్ మద్దిలేటి పసుపుల, కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్, అరుణప్రియ, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

### సాయిబండా తండాలో..

మర్రిగూడ : మండలంలోని ఖుదాభక్ష్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల సాయిబండా తండాలో సేవాలాల్ మహారాజ్ జయంతిని గిరిజనులు ఘనంగా నిర్వహించుకున్నారు. జడ్పీటీసీ పాశం సురేందర్ రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని సేవాలాల్ మహారాజ్‌కు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఆంబోతు సుధాకర్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్‌నాయక్, రమావత్ పాండు, కొర్ర పెంటియా,జటావత్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.


త్రిపురారం: రూప్లాతండాలో సేవాలాల్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న గిరిజనులు


మర్రిగూడ : సాయిబండా తండాలో..

## ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే బాలూనాయక్ కృతజ్ఞతలు

చందంపేట(దేవరకొండ), ఫిబ్రవరి 15 : సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా 15న గిరిజన ఉద్యోగులకు సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృత జ్ఞతలు తెలిపారు. దేవరకొండలో నిర్మిస్తున్న గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ దేవాలయానికి ప్రభుత్వపరంగా సహకారం అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్స్ అప్పగింత

మిర్యాలగూడ, ఫిబ్రవరి 15 : పోగొట్టుకున్న, దొంగలించబడిన మొబైల్ ఫోన్స్ తిరిగి వాటి యజమానులకు టూటౌన్ సీఐ నాగార్జున గురువారం అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటి రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్‌ను ఉపయోగించి మొబైల్స్‌ను గుర్తించి పట్టుకొని వాటిని తిరిగి యజమానులకు అప్పగిస్తున్నట్లు చెప్పారు. కాగా మొబైల్స్‌ను ట్రేస్ చేసిన టూటౌన్ కానిస్టేబుల్ రామకృష్ణను సీఐ అభినందించారు.

## వీగిన అవిశ్వాసం

- పీఏసీఎస్ చైర్మన్‌గా కొనసాగనున్న ప్రవీణ్‌రెడ్డి

దేవరకొండ రూరల్, ఫిబ్రవరి 15 : దేవరకొండ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ పల్లా ప్రవీణ్‌రెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. పీఏసీఎస్‌లో 13 మంది డైరెక్టర్లకు గాను బీఆర్ఎస్‌కు చెందిన 10మంది, కాంగ్రెస్‌కు చెందినవారు ముగ్గురు ఉన్నారు. కాగా, చైర్మన్ ప్రవీణ్‌రెడ్డిపై అవినీతి ఆరోపణలు చేస్తూ 9మంది డైరెక్టర్లు జనవరి 24న డీసీఓకు అవిశ్వాస తీర్మానం అందజేశారు. సభ్యుల తీర్మానం మేరకు జిల్లా సహకార సంఘం అధికారి కిరణ్ గురువారం మండల సహకార సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఒక్కరూ కూడా హాజరు కాలేదు. దీంతో అవిశ్వాసం వీగిపోయినట్లు డీసీఓ కిరణ్ ప్రకటించారు. చైర్మన్‌గా పల్లా ప్రవీణ్‌రెడ్డి కొనసాగనున్నట్లు తెలిపారు.

## ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న చెర్కు లింగం గౌడ్

మర్రిగూడ ఫిబ్రవరి 15: మండలంలోని మేటిచందాపురం గ్రామానికి చెందిన మహ్మద్ ఫరీనా బేగం గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మాజీ సర్పంచ్ చెర్కు లింగం గౌడ్ ఆమె మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు అందజేశారు.ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఐతగోని అశోక్ గౌడ్,నాయకులు మహ్మద్ మహబూబ్ మౌలాలి ఉన్నారు.

## రైతు కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ పరామర్శ


మల్లయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్

శాలిగౌరారం, ఫిబ్రవరి 15 : శాలిగౌరారం గ్రామానికి చెందిన రైతు జోగు మల్లయ్య ఇటీవల విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన విషయం తెలిసిందే. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ గురువారం గ్రామానికి చేరుకొని మల్లయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్, ఎంపీటీసీ జోగు సైదమ్మాశ్రీనివాస్, గుండా శ్రీనివాస్, గుజిలాల్ శేఖర్‌బాబు, సురేశ్‌రెడ్డి, రాపాక రాజు, నిమ్మల సురేశ్ గౌడ్, గుండ్ల వెంకటయ్య ఉన్నారు.

## వైభవంగా లక్ష్మీనర్సింహాస్వామి కల్యాణ మహోత్సవం


పీఏపల్లి :కల్యాణ మహోత్సవం పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 15 : మండలంలోని మేడారం లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం తెల్లవారుజామున స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణమహోత్సవంలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ లక్ష్మీనర్సింహాస్వామి అనుగ్రహం పొందాలని దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పెర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వల్లపురెడ్డి, ప్రధాన కార్యదర్శి పరమేశ్, మాజీ సర్పంచ్ కాలుసాని అరుణ, రంగారెడ్డి పాల్గొన్నారు.

### ఘనంగాఅష్టలక్ష్మి ఆలయ వార్షికోత్సవం

మిర్యాలగూడటౌన్: రైల్వేకాలనీ సాయిదత్త ఆశ్రమంలోని అష్టలక్ష్మి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి అభిషేకాలు చేశారు. అనంతరం లక్ష్మీనారాయణుల కల్యాణాన్ని కనుల పండువగా జరిపించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష కార్యదర్శులు గుండా శ్రీనివాస్, గుడుగుంట్ల నరేందర్, మట్టయ్య, సోమన్న పాల్గొన్నారు.

### లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం

వేములపల్లి : లక్ష్మీదేవిగూడెంలో గోపయ్యస్వామి సమేత లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి 5వ వార్షికోత్సవ కల్యాణాన్ని వేద పండితులు సూర్యకుమార్‌శర్మ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వందల మంది భక్తులు పాల్గొని కల్యాణాన్ని వీక్షించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### నేటి నుంచి లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు

కట్టంగూర్: కట్టంగూర్‌లోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి నూతన రంగులతో పాటు విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. 20న స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డిపల్లి మనోహర్ తెలిపారు.

## చదువుల్లో రాణిస్తే మంచి భవిష్యత్ : సీఐ వీరబాబు


ప్రోత్సాహక పంపిణీలో పాల్గొన్న సీఐ వీరబాబు, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఖాజన్‌గౌడ్

మిర్యాలగూడ, ఫిబ్రవరి 15 : విద్యార్థులు చదువుల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని రూరల్ సీఐ వీరబాబు, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఖాజన్‌గౌడ్ అన్నారు. స్థానిక వైష్ణవి కాన్ఫరెన్స్ హాల్‌లో క్యూబ్‌రూట్స్ ఫౌండేషన్ నార్కట్‌పల్లి- అద్దంకి మేదరమెట్ల ఎక్స్‌ప్రెస్ హైవే లిమిటెడ్ ఆధ్వర్యంలో నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి వెంట ఉన్న 21 ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన చెందిన 31మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.10వేల చొప్పున ప్రోత్సాహక బహుమతి అందించి మాట్లాడారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2019 నుంచి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహకం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఏఈ రాంబాబు, ఫౌండేషన్ అధికారులు అరుణ్, చక్రవర్తి, మైత్రి, నర్సింగ్, ప్రసాద్ పాల్గొన్నారు.

## ఆర్టీసీలో ప్రగతి చక్ర మాస పురస్కారాలు


పురస్కారాలు అందజేస్తున్న రీజినల్ మేనేజర్ శ్రీదేవి

మిర్యాలగూడటౌన్, ఫిబ్రవరి 15 : మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో ప్రగతి చక్ర మాస మహాలక్ష్మి పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. రీజినల్ మేనేజర్ శ్రీదేవి ఈసం దర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీలో మహాలక్ష్మి పథకం ప్రారంభమైన నాటి నుంచి బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగినప్పటికీ వారికి అసౌకర్యం కలుగ కుండా సిబ్బంది అభివృద్ధికి కృషి చేయడం అభినందించ తగ్గ విషయమన్నారు. అనంతరం జనవరిలో అధిక ఆదాయాన్ని తీసుకొచ్చి మొదటి రెండు స్థానాల్లో నిలిచిన రమణ, విజయలక్ష్మి మూడోస్థానంలో నిలిచిన సైదులుకు నగదు పురస్కారాలతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఎం పాల్, సీఐ సంధ్యారాణి, ఎంఎఫ్ యాదగిరి,ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

### దత్తాత్రేయ స్వామి ఆలయానికి విరాళం

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 15 : పిల్లిగుండ్లతండాలోని దత్తాత్రేయ వేంకటేశ్వర, ఆంజనేయ, గణపతిస్వామి వార్లను గురువారం బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయానికి రూ.50వేల విరాళం ప్రకటించి మాట్లాడారు. వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, మాజీ సర్పంచులు జనార్దన్‌రెడ్డి, శాగం శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ ఉట్లూరి రాజశేఖర్‌రెడ్డి, షేక్ ముస్తఫా పాల్గొన్నారు


స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

### స్వపరిపాలన దినోత్సవం

తిప్పర్తి, ఫిబ్రవరి 15 : మండలంలోని సర్వారం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. విద్యార్థులు వివిధ హోదాల్లో ఒకరోజు పదవి బాధ్యతలను చేపట్టి పలువురిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం షౌకత్ అలీ, ఉపాధ్యాయులు మంజులవాణి, సాయిబాబు, రమాదేవి,సత్యనారాయణ, వెంకయ్య పాల్గొన్నారు.

### ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

శాలిగౌరారం : శాలిగౌరారం పంచాయతీ పరిధిలోని పావురాలగూడెం ఆంజనేయస్వామి ఆలయంలో బుధ వారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పా ల్పడ్డారు. సుమారు రూ.50వేల విలువ గల సొత్తు, నగదు చోరీకి గురైనట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### నకిరేకల్ తాసీల్దార్‌గా మహ్మద్ జహీరుద్దీన్

నకిరేకల్, ఫిబ్రవరి 15 : మండల తాసీల్దార్ మహమ్మద్ జహీరుద్దీన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తాసీల్దార్ గుగులోతు ప్రసాద్ నాయక్ బదిలీపై కట్టంగూర్‌కు వెళ్లారు. జహీరుద్దీన్ బదిలీపై మాడ్గులపల్లి నుంచి ఇక్కడకు వచ్చారు.

### మాడ్గులపల్లి తహసీల్దార్‌గా పద్మ

మాడ్గులపల్లి : మండల తహసీల్దార్‌గా పద్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన జమీరుద్దిన్ నకిరేకల్‌కు బదిలీ కావడంతో తిప్పర్తి నుంచి బదిలీపై వచ్చిన పద్మ బాధ్యతలు చేపట్టారు.

### తిప్పర్తి తాసీల్దార్‌గా స్వప్న

తిప్పర్తి : తిప్పర్తి తాసీల్దార్‌గా స్వప్న గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తాసీల్దార్ పద్మ మాడ్గులపల్లికి బదిలీపై వెళ్లగా కట్టంగూరు తాసీల్దార్‌గా పనిచేస్తున్న స్వప్న బాధ్యతలు చేపట్టారు

### మునుగోడు ఎంపీఓగా స్వరూపరాణి

మునుగోడు : మునుగోడు నూతన ఎంపీఓగా కె.స్వరూపరాణి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎంపీఓగా పనిచేసిన కె.సుమలత కనగల్‌మండలానికి బదిలీ కావడంతో ఆమె స్థానంలో చండూరులో పనిచేస్తున్న స్వరూపరాణి ఇక్కడకు బదిలీ చేయడంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు.

### నల్లగొండ ఎక్సైజ్ సీఐగా బూర ప్రసాద్

నల్లగొండ,ఫిబ్రవరి 15 : నల్లగొండ ఎక్సైజ్ సీఐగా ప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ధూల్‌పేట సీఐగా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం నల్లగొండకు బదిలీ చేసింది. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా పని చేసిన వెంకటేశ్వర్‌రెడ్డి మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీయ్యారు.

### చిట్యాల సీఐగా నాగరాజు

చిట్యాల, ఫిబ్రవరి 15 : నార్కట్‌పల్లి సీఐగా కాయగూరి నాగరాజు చిట్యాలలోని తన కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. నాగరాజు నల్లగొండ డీఎస్‌బీ నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా పని చేసిన తొట్ల మహేశ్ ఐజీబీ మల్టీ జోన్-2 ఆఫీస్‌కు బదిలీ అయ్యారు.

### నల్లగొండ ఎంపీడీఓగా వెంకట్‌రెడ్డి

నల్లగొండ రూరల్ :నల్లగొండ ఎంపీడీఓగా ఎస్ .వెంకట్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్‌రెడ్డి బీబీనగర్‌కు బదిలీయ్యారు. వెంకట్‌రెడ్డి సంగారెడ్డి జిల్లా నుంచి బదిలీపై వచ్చారు.

### మార్కెట్ కమిటీ పీఐసీగా సబిత

నిడమనూరు : నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జిగా యాదాద్రి భువనగిరి జిల్లా మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్ ఎ.సబిత బాధ్యతలు చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేషన్లు, నామినేటెడ్ పదవుల పాలకవర్గాలను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డిప్యూటీ డైరెక్టర్ సబిత ను పర్సన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆమె బాధ్యతలు చేపట్టారు.

### గీత కార్మికులకు అండగా టాడీ కార్పొరేషన్

- కేజీకేఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకన్న

నీలగిరి, ఫిబ్రవరి 15 : గీత కార్మికుల కుటుంబాలకు టాడీ కార్పొరేషన్ అండగా నిలుస్తుందని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండా వెంకన్న అన్నారు. కనగల్ మండలం పర్వతగిరి గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు నకిరేకంటి శంకరయ్య తాడిచెట్టుపై నుంచి జారీ పడి గాయాలు కావడంతో ఆయనకు టాడీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రూ.15వేల చెక్‌ను బాధిత కుటుంబానికి గురువారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో మం ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు యాదయ్య, సోము ముత్యాలు, నాయకులు బొల్లు రవీందర్ కుమార్, చవగొని రమేశ్, నాగరాజు, చంద్రయ్య పాల్గొన్నారు.

### 'గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి'

త్రిపురారం, ఫిబ్రవరి 15 : గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని డీటీ గాదె సైదులు అన్నారు. పారిశుధ్య వారోత్సవాలు ముగియడంతో గురువారం మండలంలోని చెన్నాయి పాలెం, సత్యంపాడు, అల్వాలపాడు గ్రామాల్లో గురువారం ఆయన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కరెంట్ స్తంభాలు, మురుగు కాల్వలు, సీసీరోడ్లు, గ్రంథాలయం తదితర విషయాల గురించి చర్చించారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడి, ఆశా వర్కర్లు, మహిళ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### సరస్వతీ దేవికి వెండి తొడుగులు బహూకరణ

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 15 :అవంతీపురం సరస్వతీ దేవి ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు రూ.3 లక్షల విలువ చేసే 3.5 కిలోల వెండి తొడుగులను ఆలయ కమిటీ చైర్మన్ శరత్‌కుమార్‌కు మిర్యాలగూడ పట్టణానికి చెందిన కుక్కడపు రాంమూర్తి ఆయన కుమారులు సంతోష్ -రాధిక, మహేశ్-లత దంపతులు గురువారం అందజేశారు.

### విద్యుదాఘాతంలో రైతు మృతి

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 15 : మండలంలోని జాలుబాయితండాలో గురువారం రాత్రి విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన జర్పుల లింగ(35) విద్యుత్ మోటారు రెండురోజులుగా పని చేయడంలేదు. దాంతో గురువారం ఉదయం మెకానిక్‌ను తీసుకెళ్లి మోటారు చూపించడంతో మోటర్‌లో ఏ లోపం లేదని చెప్పాడు. సాయంత్రం భార్య మంగతో కలిపి మోటారు వద్దకు వెళ్లి, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద లోపం ఉందేమోనని అక్కడికి వెళ్లగా ఎర్త్ వైర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కళ్ల ముం దే జరుగడంతో భార్య మంగ లబోదిబోమంటూ మొత్తుకోవడం ఇరుగుపొరుగు రైతులు కాపాడే ప్రయత్నం చేశారు. లింగను మిర్యాలగూడ ప్రాంతీయ దవాఖానకు తరలించగా పరీక్షలు చేసి వైద్యులు అప్పటికే మరణించినట్లు వెల్లడించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### కారును ఢీ కొట్టిన డీసీఎం.. వ్యక్తికి తీవ్ర గాయాలు

నీలగిరి, ఫిబ్రవరి 15 : చందనపల్లి గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. నల్లగొండ రూరల్ ఎస్ఐ శివకుమార్ తెలిపారు. సూర్యాపేట నుంచి నల్లగొండ వైపునకు వస్తున్న తోకల శ్రీనివాస్ కారుకు, నల్లగొండ నుంచి నకిరేకల్ వైపు వెళ్తున్న డీసీఎం డ్రైవరు నకినబోయిన అశోక్ అతివేగంగా అజాగ్రత్తగా నడిపి కారును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తోకల శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కావడంతో నల్లగొండలోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. శ్రీనివాస్ సోదరుడు భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.